క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



గుడ్లవల్లేరు: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం ఏర్పడుతుందని శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ అన్నారు. స్థానిక కాలేజీ 26వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్పోర్ట్స్, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఇండివ్యుటువల్ చాంపియన్ షిప్ కె.అనిత(ఐఓటీ, థర్డ్ ఇయర్), ఇండివ్యుడివల్ చాంపియన్ షిప్ కె.విజయ వర్మ(సివిల్, సెకండియర్), క్రికెట్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బి.రాజా అరుణ్ ప్రకాష్(మెకానికల్, ఫోర్త్ ఇయర్) సాధించారన్నారు. జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజీ – 8 టోర్నమెంట్‌లో మెన్ అండ్ ఉమెన్ కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, టేబుల్ టెన్నీస్, సాఫ్ట్ బాల్, నెట్ బాల్ తదితర విభాగాల్లో కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు బహుమతులు సాధించారని చెప్పారు. విజేతలకు ఈ సందర్భంగా బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, డైరెక్టర్ డాక్టర్ జి.ప్రసాద్, పీడీ ఎం.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 15 మందికి ఉద్యోగాలు



గుడివాడటౌన్: క్యాంపస్ సెలక్షన్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో శ్రీ చైతన్య ఈ– టెక్నో స్కూల్ గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగానికి చెందిన 35 మంది విద్యార్థులు ఎంపికలో పాల్గొనగా 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఏఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, పరిజ్ఞానం ఇందుకు నిదర్శనమని ప్రిన్సిపాల్ చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, కెమిస్ట్రీ విభాగాధిపతి ఎం.సుభాషిణి, చైతన్య టెక్నో ప్రతినిధి ఎం.అశోక్‌కుమార్ అభినందించారు.

విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం



పామర్రు: స్థానిక పాల శీతల కేంద్ర ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన విజయ డెయిరీ పార్లర్‌ను గురువారం ప్రారంభించారు. కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయి వెంకటరమణ పార్లర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ వారి ఆహారపు ఉత్పత్తులు నాణ్యతతో కూడిన మన్నికగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, సేల్స్ మేనేజర్ లక్ష్మణరావు, పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ దామోదర గోపినాథ్, సూపర్‌వైజర్లు, పలు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి దంపతులకు ఎమ్మెల్యే కైలే పరామర్శ



పామర్రు: కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, లక్ష్మి దంపతులను వారి ఇంటి వద్ద పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పరామర్శించారు. ఇటీవల కృష్ణారెడ్డి మామ తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మర్రెడ్డి రామకోటి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని దశ దిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో కృష్ణారెడ్డి దంపతులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరేపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలకు వాహనదారులు సహకరించాలి

గుడివాడరూరల్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎల్ఎస్ఎన్ మూర్తి గురువారం తెలిపారు. మల్లాయపాలెం సమీపంలోని చౌటపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను ఎస్ఐ సిబ్బందితో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల తనిఖీల సందర్భంగా వాహనదారులు తమకు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో వాహనాల్లో భారీగా నగదు తరలించకూడదన్నారు. రూ.50 వేలు మించి నగదు వెంట తీసుకెళ్తే దానికి సంబంధించి పత్రాలు ఉండాలని చెప్పారు. లేనిపక్షంలో నగదు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

గుడ్ మార్నింగ్ కలిదిండిలో ఎమ్మెల్యే డీఎన్నార్



గుడ్ మార్నింగ్ కలిదిండిలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కలిదిండి: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కలిదిండి 12వ రోజు 12, 13వ వార్డుల్లో గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమంలో భాగంగా గురువారం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రజలకు శుభోదయం పలుకుతూ క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేశామని చెప్పారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల ఇబ్బందులను చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు.

మరోసారి సీఎంను ఆశీర్వదించాలి..

రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న పథకాలు కొనసాగాలంటే మరోసారి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు కూటమి పేరుతో నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని ఎమ్మెల్యే సూచించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యులు బొర్రా సత్యవతి, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఎంపీటీసీ నీలి సుమన్, ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు నీలపాల వెంకటేశ్వరరావు, అయినాల బ్రహ్మాజీ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు గద్దె ఆనంద్‌కుమార్, వెంకటేశ్వర దేవస్థాన చైర్మన్ బోయిన రామకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు దనికొండ మేరమ్మ, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పారదర్శక పాలన అందజేస్తున్న జగన్‌ను ఆశీర్వదించండి

మండవల్లి: రాష్ట్రంలో పారదర్శక పాలన అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గన్నవరం, మొఖాసాకలవపూడి, సింగనపూడి గ్రామాల పరిధిలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 34వ రోజు ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధివీధిన ఎమ్మెల్యే డీఎన్నార్‌కు ఘన స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. డీఎన్నార్ మాట్లాడుతూ చెప్పిన పథకం చెప్పినట్లుగా చెప్పిన సమయానికి అందించిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. అర్హతే ప్రామాణికంగా అవినీతి, దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా తనను, పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను దీవించాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, గుడివాడ తమ్మిస్వామి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన వరప్రసాద్, గుడివాడ వరప్రసాద్, పార్టీ నాయకులు బొమ్మనబోయిన గోకర్ణ, మెండా సురేష్, గుడివాడ మురళీకృష్ణ, తలారి అన్నిబాబు, ఇమ్మడి మరియన్న, బొబ్బిలి రత్తయ్యనాయుడు, సర్పంచ్ జయమంగళ కాసులు, కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గన్నవరంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

‘సొంత నిధులతో ఎమ్మెల్యే కొడాలి నాని ప్రజా సేవ’

గుడివాడటౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తన రాజకీయ జీవితం ప్రారంభించక ముందే సొంత నిధులతో ప్రజా సేవ చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో గురువారం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోరుకునే నాయకుడు కొడాలి నాని అన్నారు. సొంత నిధులతో ట్యాంకర్లు ఏర్పాటు చేసి గుడివాడ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో నీటి సరఫరా చేసిన ఘనత కొడాలి నానికే దక్కుతుందన్నారు. టీడీపీ నాయకుల విమర్శలను ఆయన తప్పుపట్టారు. పేదవారికి సాయం, ఆరోగ్యం విషయంలో, ప్రార్థనా మందిరాల నిర్మాణాలు, ఆలయాల నిర్మాణం వంటి పుణ్యకార్యక్రమాలు ఎన్నో చేసిన ఘనత కొడాలి నానిదన్నారు. 14 ఏళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టీడీపీ నాయకులు పట్టణంలో గాని, నియోజకవర్గంలో గాని చేసిన అభివృద్ధి పనులు చెప్పాలన్నారు.

కరోనా సమయంలో జాడలేరు..

కరోనా సమయంలో ప్రజలకు సేవ చేసేందుకు కనీసం ఒక్క టీడీపీ నాయకుడు కూడా రోడ్డుపై కనిపించలేదన్నారు. కొడాలి నాని స్పందించి రూ.45 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. నాని చొరవతో వైఎస్సార్ హయాంలో 105 ఎకరాల పొలం కొని కోట్లాది రూపాయలతో సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు చేశారన్నారు. ఇది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పరిశుభ్రమైన నీరు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌ను ఒప్పించి 120 ఎకరాలు చెరువు తవ్వడానికి భూసేకరణ చేసిన విషయం మీరు మర్చిపోయారా అని ప్రశ్నించారు. అభివృద్ధి, ప్రజా సేవపై చర్చకు తాను సిద్ధమన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, 18వ వార్డు ఇన్‌చార్జి అల్లం రామ్మోహనరావు, మాజీ కౌన్సిలర్ గణపతి, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, పెయ్యల ఆదాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నేడు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

పామర్రు: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ కార్యాలయ సిబ్బంది గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు పార్టీ కార్యాలయంలో, 7.30 నిమిషాలకు చాట్లవానిపురంలో, అనంతరం పెదమద్దాలి, జమీగొల్వేపల్లి, కొమరవోలు, అడ్డాడ, రిమ్మనపూడి గ్రామంలోని బీజేఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే కైలే పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు 42వ వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కొవ్వాడ దివ్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం విఘ్నేశ్వర పూజ, నవగ్రహ పూజ, కలశస్థాపన, అఖండస్థాపన, ధ్వజారోహణ, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, 6వ తేదీ రాత్రి 8 గంటలకు బ్రహ్మశ్రీ గూడూరు వెంకట రామకృష్ణ యాజ్ఞీకత్వంలో శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. గూడూరు శ్రీనివాసరావు, నాగవెంకటశాస్త్రి, నాగసాయికుమార్ అర్చకులుగా వ్యవహరిస్తారన్నారు. 7వ తేదీ ఉదయం గ్రామోత్సవం, సాయంత్ర 6 గంటల నుంచి అన్నసమారాధన, రాత్రి పవళింపు సేవ జరుగుతుందని చెప్పారు.

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా లావేటి వీరశివాజీ

కైకలూరు: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బి) పార్టీ కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా లోకుమూడి గ్రామానికి చెందిన లావేటి వీరశివాజీ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పీవీ సుందరరామరాజు నియామక ఉత్తర్వులను గురువారం పంపారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ 1939లో నేతాజీ సుభాష్ చంద్రబోష్ స్థాపించారు. సింహం గుర్తుపై అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. లావేటి వీరశివాజీ బీజేపీలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు.

నాడు – నేడు పనులు భేష్

ముదినేపల్లిరూరల్: మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో నాడు – నేడు కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. నాడు – నేడు పనుల ప్రత్యేక అధికారి, పరిశీలకులు ఏఎల్ఎస్ఓ రాధాకృష్ణ, ఎంఈఓ కె.నరేష్‌కుమార్ ఈ పాఠశాలను గురువారం పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు బేతాల రాజేంద్ర ప్రసాద్‌ను ప్రశంసించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించి ఆశించిన స్థాయిలో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. పాఠశాల రూపురేఖలు మారిపోవడంతో గ్రామస్తుల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం ఏర్పడేందుకు అవకాశం కలిగిందన్నారు. ఇందుకు తగ్గస్థాయిలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య మరింత పెరిగేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అధికారుల వెంట సీఆర్పీ ఆంజనేయప్రసాద్ ఉన్నారు.



పెయ్యేరు పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

పింఛన్‌దారులకు తప్పని అవస్థలు



పామర్రులో సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



ఐలూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

తోట్లవల్లూరు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల్లో పింఛన్ల పంపిణీ గురువారం కొనసాగింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు పింఛన్ల కోసం మండుటెండలో సచివాలయాలకు వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. తోట్లవల్లూరు మండలంలో 77 శాతం పింఛన్ల పంపిణీ చేశామని ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్లు అందజేశామన్నారు. అనారోగ్య పీడితులకు, నడవ లేని వృద్ధులకు వారి ఇళ్ల వద్దే సచివాలయ సిబ్బంది పింఛన్ అందించారని చెప్పారు.

పమిడిముక్కల: మండలంలోని 17 సచివాలయాల్లో పింఛన్‌ల పంపిణీ వేగంగా జరుగుతుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు 73.02 శాతం పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దనే పింఛన్ అందుకునే వారమని, చంద్రబాబు చేసిన కుట్రల వల్ల ఇబ్బందులు పడాల్సి వచ్చిందని పింఛన్‌దారులు ఆవేదన చెందారు.

మొవ్వ: సచివాలయాల ద్వారా పింఛన్ తీసకునేందుకు వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణతీతంగా మారాయి. మండుటెండలో కిలో మీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకున్నారు. మండలంలో 79.85 శాతం పింఛన్ పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖరరావు తెలిపారు.

పెన్షన్‌ల కోసం నిరీక్షణ

పామర్రు: గ్రామ సచివాలయాల వద్ద పింఛన్‌దారులు గురువారం క్యూ కట్టారు. వృద్ధులు, దివ్యాంగులు ఇతరులు ఉదయం 11 గంటల వరకు వేచి ఉన్నారు. గ్రామంలోని అన్ని సచివాలయాల వద్ద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పామర్రు కార్యదర్శి అబ్దుల్ సలీం తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ముదినేపల్లిరూరల్: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ఎస్ఐ డి.వెంకటకుమార్ అన్నారు. మండలంలోని చిగురుకోట, వడాలి, వైవాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి గురువారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు నిజాయతీగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఇందుకు పోలీసులు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. పార్టీలు చూపే ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దని అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనరాదని శాంతియుతంగా పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీలకు నగదు చెల్లించాలి

తోట్లవల్లూరు: ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు డిమాండ్ చేశారు. మండలంలోని పెనమకూరులో గురువారం ఆయన పర్యటించారు. ఉపాధి కూలీలతో ప్రకాశరావు మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో పనులు చేసిన కూలీలకు కూలీ నగదును వెంటనే చెల్లించేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి కనీసం 50 పని దినాలు కల్పించాలని ప్రకాశరావు కోరారు.

గుడివాడలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

గుడివాడటౌన్: గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతోంది. స్థానిక సత్యన్నారాయణపుర వాసులు గురువారం ఆయనకు సాదర ఆహ్వానం పలికారు. వార్డు ఇన్‌చార్జి జిల్లా రఘు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొని కొడాలి నానికి ఘన స్వాగతం పలికారు. తొలుత వార్డులోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడప గడపకు అభివాదం చేస్తూ సాగిన ఈ ఎన్నికల ప్రచారంలో వృద్ధులు కొడాలి నానికి ఆశీస్సులు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని ఆయన పార్టీకి ఓటు వేయడం అందరి బాధ్యత అన్నారు. మహిళలు హారతులిచ్చారు. పలువురు వీర తిలకం దిద్ది తాము మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, ఎంపీ నారాయణరెడ్డి, కె.కుమార్‌రెడ్డి, షేక్ బాజీ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహరావు, చింతల భాస్కరరావు, నాయకులు దారం వెంకటేశ్వరరావు, ఎ.కృష్ణమోహన్, టీవీ రమణకుమార్, శేషగిరిరావు, వెంపల అప్పారావు, చుండూరి శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానికి వినూత్న సత్కారం

గుడివాడటౌన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక బేతవోలు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)ని ఘనంగా సత్కరించారు. విద్యుత్ దీపాల అలంకరణతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గజమాలతో ఆయనను సత్కరించారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే నాని



విద్యుత్ దీపాల గజమాలతో ఎమ్మెల్యే కొడాలి నానిని సత్కరిస్తున్న నాయకులు

12 మంది వలంటీర్ల రాజీనామా

నందివాడ: తమ గురించి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలంలోని 12 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓకు తమ రాజీనామాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు సరేళ్ల రాజేంద్రప్రసాద్, కంబాల రవికుమార్, కె.లోకేష్, సరేళ్ల తనూషా, ముక్కు పావని రత్నమాల, గోరుముచ్చు ధనలక్ష్మి, మొండు వినీల, కడిమి సౌజన్య, మీసాల పుణ్యవతి, మీసాల అంజలీదేవి, పెయ్యల సుమ, పెయ్యల దీపికలు మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా తాము సేవలందిస్తున్నామన్నారు. కానీ తమను అకారణంగా ప్రతిపక్ష పార్టీలు విమర్శించడం సరికాదని చెప్పారు. ప్రతి నెల వృద్ధులకు, దివ్యాంగులకు పెన్షన్లు అందచేస్తుండేవాళ్లమని కానీ రాజకీయల కుట్రల కారణంగా తమపై ఆభాండాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీపై కోర్టులో స్టే వేసిన చంద్రబాబు అండ్ టీమ్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తమ ఉసురు తగలకుండా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.



రాజీనామా పత్రాలు చూపుతున్న నందివాడ మండల వలంటీర్లు

వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలి



బొమ్మినంపాడులో ప్రచారం చేస్తున్న స్వాతి, నాయకులు



కలిదిండిలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీఅనుపమ, నాయకులు

ముదినేపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ కోరారు. పార్టీ కైకలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏలూరు లోక్‌సభ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డీఎన్నార్, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ తరఫున మండలంలోని బొమ్మినంపాడులో మూడో రోజైన గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న మహిళా పక్షపాతిగా వ్యవహరిస్తూ మహిళల ఆర్థికాభ్యున్నతికి పలురకాలుగా చేయూతను అందిస్తున్నారన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ముందుకు వచ్చే ప్రతిపక్ష నేతలను ఎలాంటి పరిస్థితుల్లో నమ్మకుండా ఇచ్చిన మాటకు కట్టుబడే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళల నుంచి స్వాతితో పాటు నాయకులకు అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, లేళ్ల ఆంజనేయులు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

ప్రగతికి ఓటు వేయండి

కలిదిండి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్ద కోడలు దూలం శ్రీ అనుపమ కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం భాగంగా పడమటిపాలెం గ్రామంలో నాయకులతో కలిసి గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆమె ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ కులం, మతం, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ నీలపాల అయినాల బ్రహ్మాజీ, మూలలంక ఎంపీటీసీ రావాడి బాలు, చిట్టూరి నాంచారయ్య, వాసు, ఏకో నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

కైకలూరు: ప్రజాసామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని కళాజాత ప్రదర్శన ద్వారా కళాకారులు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీకి చెందిన కళాకారుడు వీరనాల శివరామకృష్ణ బృందం పందిరిపల్లిగూడెం గ్రామంలో ఓటు హక్కుపై గురువారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందడం, గూగుల్ ప్లే స్టోర్‌లో సీవిజిల్ యాప్‌ను నమోదు చేసుకోవడం, వీడియో, ఫొటోలు అప్‌లోడ్ చేయగానే 100 నిమిషాల్లో ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవడం, టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా లభించే సేవలు వంటి పలు విషయాలను కళాకారులు వివరించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

